జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 25-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 682 పేజీలు: 4 వెల : రూ.7



# ప్రభుత్వ భూమిలో.. ప్రైవేట్ లేఔట్!

- అంపురం భూభాగోతంలో మరో కొత్త మలుపు
- హైకోర్టులో కొనసాగుతున్న భూ వివాదం
- బరితెగిస్తున్న ఆక్రమణదారులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- ఆక్రమణదారులకు అండగా కూటమి నేతలు

**సోంపేట, మే 24 (వార్త):** వివాదాస్పదంగా ఉన్న భూమిలో ఆక్రమణదారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. కోర్టు ఆదేశాలు కూడా లెక్కచేయకుండా సదరు ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి బరితెగించారు. అటు హైకోర్టును ఇటు రెవెన్యూ యంత్రాంగాన్ని ఏమాత్రం ఖాతరు చేయకుండా ఏకంగా వెంచర్ వేయడానికి రంగం సిద్ధం చేశారు. కంచిలి మండలం అంపురం గ్రామ రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి పక్కన ఉన్న 1.12 ఎకరాల డీకేటి పట్టా భూమిని అనేక నెలల విచారణ అనంతరం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వెంటనే ఆక్రమణలు తొలగించాలని లోకాయుక్త గత ఏడాది సెప్టెంబర్లో తీర్పు వెలువరించిన విషయం విదితమే. సదరు భూమిపై వివాదాన్ని కొనసాగిస్తూ మరో వ్యక్తి తాను అసలైన వారసుడు అంటూ హైకోర్టును ఆశ్రయించడంతో ప్రస్తుతం ఉన్నత న్యాయస్థానంలో వివాదం కొనసాగుతూనే ఉంది. జూన్ 16న దీనిపై విచారణ జరగాల్సి ఉంది. అప్పటివరకు ప్రైవేట్ వ్యక్తులు గాని ఇతరులు గాని ఈ వివాదాస్పద భూమిపై వ్యవహారాలు చేయడం హైకోర్టును బేఖాతరు చేయడమే అవుతుంది. దీన్ని చట్టాన్ని ధిక్కరించడంగా చెప్పవచ్చు. అయినా సరే బరితెగించిన కొందరు ఆక్రమణదారులు ఇటీవల సదరు వివాదాస్పద భూమిని జెసిబితో చదును చేయించి వెంచర్ వేసేందుకు అనుకూలంగా ఇప్పటికే రాళ్లను పాతిపెట్టి భూమి రూపురేఖలను మార్చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖ దీన్ని పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై బరితెగిస్తున్న ఆక్రమణదారుల వెనుక మండలానికి చెందిన ఒకరిద్దరు కూటమినేతలు సూత్రధారులుగా పని చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ వివాదాస్పద భూభాగతంపై ఈ ఏడాది మార్చి 28న 'అంతం లేని అంపూరం భూభాగోతం' శీర్షికన 'జాతీయ వార్త'లో కథనం ప్రచురించిన విషయం విధితమే. దీనికి సంబంధించి జాతీయ వార్త ప్రతినిధి సేకరించిన పూర్వపరాలు ఇలా ఉన్నాయి.


అంతం లేని అంపురం.. భూబాగోతం!
మూడేళ్ల క్రితం వివాదానికి బీజం..
హైకోర్టు ఆదేశాలతో ఆగిపోవాల్సి వచ్చింది : తహసిల్దార్

దశాబ్దాల క్రితం కంచిలి మండలానికి చెందిన అనుపోజు లక్ష్మి అనే మహిళకు రెవెన్యూ శాఖ అంపురం రెవిన్యూ పరిధిలో జాతీయ రహదారికి ఆనించి 1.12 ఎకరాల మెట్టు భూమికి బిడిఆర్ పట్టా అందజేశారు. సదరు భూమి క్రయ విక్రయాల ద్వారా పలువురు చేతులు మారి చివరికి కంచిలికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి చేతికి చిక్కడం గమనార్హం. ఈ దశలోనే సదరు భూమికి సమీపంలో రోడ్డు పక్కన ఓ వ్యక్తి తాత్కాలికంగా షాపు ఏర్పాటు చేయడం దాన్ని భూమి హక్కుదారులు మేమే అంటూ కొంతమంది షాప్ పెట్టడాన్ని వ్యతిరేకించడం, ఇది చిలికి చిలికి గాలి వానలా వివాదంగా మారి చివరకు లోకాయుక్త వరకు వెళ్లడం గమనార్హం. కేసు విచారణ జరిపిన లోకాయుక్త ఈ భూమి క్రయవిక్రయాల వ్యవహారంలో జరిగిన మొత్తం గలీజును బయటకు తీసింది. 1987లో బిడిఆర్ పట్టా పొందిన అనుపోజు లక్ష్మి ద్వారా జీరు బాలకృష్ణ అనంతరం కిషన్ స్వరూప్ గుప్తాలకు భూమి బదిలీ కావడం గుర్తించారు. ఈ క్రయవిక్రయాల దశలో 2018లో అప్పటి కంచిలి తాహసిల్దార్ దంగేటి రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన మ్యుటేషన్ అక్రమమని లోకాయుక్త గుర్తించింది. బిడిఆర్ పట్టాదారు అనుపోజు లక్ష్మి గాని ఆమె కుటుంబీకులు గానీ ప్రస్తుతం లేనందున సదరు భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆక్రమణలు ఉన్న యెడల వెంటనే తొలగించాలని లోకాయుక్త జిల్లా కలెక్టర్‌ను ఆదేశించడం తద్వారా కంచిలి తాసిల్దార్‌కు ఆదేశాలు రావడం విధితమే.

ఇక్కడే వివాదం మరో మలుపు తిరిగింది. అంతవరకు లోకాయుక్త విచారణ జోలికి వెళ్ళని అనుపోజు లక్ష్మి ఇంటి పేరుతో ఉన్న ఓ వ్యక్తి రాష్ట్ర హైకోర్టుకు వెళ్లి తానే అసలైన వారసుడునని పిటిషన్ వేయడంతో కథ అడ్డం తిరిగింది. హైకోర్టు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కంగుతినాల్సి వచ్చింది. ప్రస్తుతం హైకోర్టులో వివాదం కొనసాగుతుండగా మరోవైపు కోట్లాది రూపాయల విలువైన ఇదే భూమిపై కొందరు కబ్జాదారులు కన్నేయడం, దీనికి కొంతమంది అధికార కూటమి రాజకీయ నేతలు అండగా నిలవడంతో ఇప్పటికే రాళ్లుపాతి రియల్ వెంచర్ కోసం సిద్ధం కావడం కంచిలి మండలంలో అందరినీ అయోమయానికి గురిచేస్తుంది. ప్రభుత్వ భూమికే దిక్కులేదు... సామాన్యుల భూములకు రక్షణ ఎక్కడ అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. దీన్ని అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులపైన తీవ్ర ఒత్తిళ్ళు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమి... హైకోర్టు వివాదంలో కొనసాగుతున్న భూమిపై కబ్జాదారులు ఇలా రెచ్చిపోవడం అందర్నీ విస్మయ పరుస్తోంది. మరి కొద్ది నెలల్లో ఈ వివాదాస్పద భూమి పూర్తిగా ప్రభుత్వ పరం అవుతుందా లేక అనుపోజు లక్ష్మి అసలు వారసుడుగా చెప్పుకుంటున్న లోకాయుక్త తీర్పు అనంతరం లేటెస్ట్‌గా ఎంట్రీ ఇచ్చిన వ్యక్తికి సొంతమవుతుందా వేచి చూడాల్సి ఉంది.

ఇక్కడ జరుగుతున్న వ్యవహారంపై కంచిలి తహసిల్దార్ రమేష్ కుమార్ వద్ద జాతీయ వార్త వివరణ కోరింది. కేసు హైకోర్టులో ఉండగా వివాదాస్పద భూమిపై ఎవరైనా అక్రమ నిర్మాణాలు అలాగే లేఅవుట్ల కోసం రాళ్లు పాతడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ రమేష్ కుమార్ హెచ్చరించారు. ప్రస్తుతం ఈ కేసు హైకోర్టులో కొనసాగుతుందని త్వరలో తీర్పు వెలువడుతుందని అంతవరకు అన్ని వర్గాలు ఓపిక, సహనంతో ఉండడం చాలా మంచిదని అన్నారు. కోర్టును చట్టాలను ధిక్కరించి వ్యవహరిస్తే తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగ పరుచుకోండి

**మెలియాపుట్టి మే 24 (వార్త):** స్థానికంగా ఉన్న శాఖగ్రంధాలయంలో సుమారు 40 రోజులు పాటు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని చిన్నపిల్లలు, విద్యార్థులు, ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని మండల విద్యాశాఖధికారి దేవేందర రావు అన్నారు. ఈనెల 28వ తేదీ మొదలుకొని జూన్ 6వ తేదీ వరకు సుమారు 40 రోజులపాటు మండల కేంద్రంలోనున్న శాఖ గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మెలియాపుట్టి శాఖాగ్రంధాల అధికారిని అనురాధ తెలిపారు. విద్యాశాఖధికారీ దేవేందర రావు తదితరులు విద్యార్థుల ఉద్దేశించి అనేక అంశాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. అంతకుముందు గ్రంథాలయధికారిని ఆర్. అనురాధ నేతృత్వంలో ఆదివారం చిత్రలేఖన పోటీలు నిర్వహణలో ముఖ్యఅతిథిగా వచ్చిన ఎంఈఓ న్యాయ నిర్ణయితగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవేంద్రరావు తోపాటు గ్రంథాలయధికారిని అనురాధ, ఉపాధ్యాయులు, శివాని, పాణిగ్రాహి, రీడర్స్ మణికంఠ, ప్రియాంక, సహాయకురాలు హేమలత విద్యార్థులు పాల్గొన్నారు.



## సముద్రంలో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

**సంతబొమ్మాళి, మే 24(వార్త):** భావనపాడు సముద్రతీరంలో స్నానానికి దిగి టెక్కలికి చెందిన పక్కి నరేష్(36) ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. విశాఖలోని పెద్దగంట్యాడకు చెందిన నరేష్ జీవనోపాధికోసం టెక్కలిలో నివాసముంటున్నాడు. ఆదివారం తోటి స్నేహితులు బెహరా శరత్, కొనారి మణి , కొనారి నవీన్ కలిసి భావనపాడు తీరానికి వచ్చాడు. సముద్రస్నానానికి దిగి లోపలకి వెళ్లగా ఆలలు తాకిడికి సముద్రంలో కొట్టుకుపోయాడు. దీంతో భావనపాడు మెరెన్ పోలీసులు గాలించగా మృతదేహం రాత్రి 8 గంటల ప్రాంతంలో తీరానికి చేరింది. మృతుడి కుటుంబసభ్యులు సమాచారం అందించి కేసు నమోదు చేసి నౌపడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 'పండగల్లో అవాంఛనీయ ఘటనలు జరగకూడదు'




**మెలియాపుట్టి మే 24 (వార్త):** దీనబందపురం గ్రామంలో నీలమ్మ తల్లి గ్రామదేవత పండగలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యువత ప్రతి ఒక్కరు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పాతపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. సన్యాసినాయుడు అన్నారు. మెలియాపుట్టి మండలం దీనబందుపురం గ్రామంలో పండగ సందర్భంగా ఆదివారం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులు, యువతతో మాట్లాడారు. పండగ సక్రమంగా నిర్వహించాలన్నారు. సంకల్పం మీటింగు పెట్టి యువత చెడుఅలవాట్లు దరి చేరకుండా ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని ప్రణాళికంగా ముందుకు సాగి ప్రతి ఒక్కరూ ప్రయోజకులు కావాలని పదిమందికి ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐతో పాటు పోలీస్ సిబ్బంది గ్రామస్తులు యువత పాల్గొన్నారు.

## గంజాయి డిటెక్షన్ కిట్‌తో తనిఖీలు



**పలాస, మే 24 (వార్త):** పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గంజాయి డిటెక్షన్ కిట్‌తో తనిఖీలు చేసిన కాశీబుగ్గ సీఐ ఎన్ని రామకృష్ణ ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఆన్-ది-స్పాట్ టెస్టింగ్ స్థానికంగానే పరీక్ష చేయవచ్చునని, ల్యాబ్ అవసరం లేదని, అత్యాధునిక టెక్నాలజీ, యాంటీ గంజాయి టెక్నాలజీతో రూపొందించబడిందని సీఐ తెలిపారు. విద్యాసంస్థలు, హాట్‌స్పాట్ ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, రోడ్డు తనిఖీలు చేపట్టవచ్చునని తెలిపారు. ర్యాపిడ్ యూరిన్ టెస్ట్ కిట్ తో ఒక నిమిషంలోనే ఫలితం వస్తుందని చెప్పారు. వ్యక్తి నుండి మూత్రం నమూనా తీసుకుంటారని, కిట్లో పెట్టడం ద్వారా నమూనాను డిటెక్షన్ కిట్లో పెడతారని తెలిపారు. పాజిటివ్ వస్తే గంజాయి సేవించిన వ్యక్తిని నేరుగా పునరావాస కేంద్రానికి లేదా అదుపులోకి తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట ట్రాఫిక్ కానిస్టేబుల్ రవి ఉన్నారు.

## రేపు అన్నపూర్ణమ్మ గ్రామదేవత 16వ వార్షికోత్సవం



**మందస, మే 24(వార్త):** మందస పట్టణంలోని శ్రీఅన్నపూర్ణమ్మతల్లి గ్రామదేవత ఆలయ 16వార్షికోత్సవం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్టు అన్నపూర్ణమ్మ గ్రామదేవత ఆలయ కమిటి నాయకులు చెప్పారు. మందసలో వేంచేసియున్న మన గ్రామ దేవత శ్రీఅన్నపూర్ణమ్మ గ్రామదేవత ఆలయం 16వ వార్షికోత్సవం ఈనెల 26(మంగళవారం)న శ్రీఅన్నపూర్ణమ్మ గ్రామదేవత ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం ఏడు గంటలకు భవానీ స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతుంది. ఉదయం 8 గంటలకు మందస గ్రామం దేవాంగుల వీధి నుంచి మార్కెట్టు రోడ్డు మీదుగా గ్రామదేవత గుడి వరకు ముగ్రాటలతో ఊరేగింపు అనంతరం గ్రామదేవతకు భక్తులచే చల్లదనం కార్యక్రమం ఉంటుంది. కార్యక్రమానికి అన్ని వీధుల నుండి మహిళలు, ముగ్రాటలతో విచ్చేసి అమ్మవారికి గ్రామప్రజలు, భక్తులు స్వయంగా అభిషేకాలు జరిపించి, అందరూ తీర్థ ప్రసాదములు స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## శ్రీరామనగరంలో శ్రీసుదర్శనమహామంత్ర హోమం



**మందస, మే 24(వార్త):** స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ (శ్రీరామ నగరం)లో ఈనెల 30 నుంచి శ్రీ సుదర్శన మహామంత్ర హోమం నిర్వహిస్తున్నట్టు శ్రీవాసుదేవసేవా సమితి ప్రతినిధులు చెప్పారు. హైదరాబాదులోని ముచ్చింతల్‌లో గల స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ (శ్రీరామ నగరం)లో మే 30నుంచి జూన్ 9వ తేదీ వరకు జరుగుతుందన్నారు. త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామనుజ జీయర్ స్వామి మంగళాశాసనములతో ప్రజల కోసం శ్రీ సుదర్శన మహామంత్ర హోమం స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో ఈ నెల 30వ తేదీ నుండి ప్రారంభమై 11 రోజుల పాటు అనగా జూన్ 9వ తేదీ వరకు నిర్వహించబడుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు ఈ మహోన్నత హోమం జరుగుతుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తగ్గి, మన దేశంలోని ప్రజలందరూ శాంతి, సంతోషం, సంపదలతో జీవితం సాగించాలని సంకల్పించి ఈ సుదర్శన హోమం జరుగుతుందన్నారు. ఈ 11 రోజులలో ఏ రోజైనా భక్తులు ప్రత్యక్షంగా పాల్గొనవచ్చునన్నారు. పాల్గొనుటకు ఎటువంటి రుసుము లేదన్నారు. గురుదక్షిణగా సమర్పించాలనుకుంటే, మీకు తోచినంత సమర్పించవచ్చని, ప్రతిరోజూ "ఓం శ్రీ సుదర్శనాయ హేతి రాజాయ నమః" అనే మంత్రాన్ని 1008 సార్లు జపించాలని సూచించారు.

## విద్యుత్ స్తంభం మార్పు



**ఇచ్ఛాపురం, మే 24 (వార్త):** పట్టణంలోని బెల్లుపడ కాలనీలోని రెండోవ లైన్‌లో ప్రజలకు ప్రమాదకరంగా మారిన పాత విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు తొలగించి, దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. చాలా రోజులుగా వంగిపోయిన ఈ స్తంభం ఎప్పుడు కూలిపోతుందోనని కాలనీవాసులు భయాందోళనకు గురయ్యేవారు. గాలులు, వర్షాలు వచ్చినప్పుడల్లా ప్రమాదం సంభవించే అవకాశం ఉండటంతో స్థానికులు, మాజీ కౌన్సిలర్ గువ్వాడ ప్రదీప్ కుమార్ పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ప్రజల విజ్ఞప్తికి స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది పాత స్తంభాన్ని తొలగించి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించిన ఎలక్ట్రికల్ ఏఈ గోవిందరావు, లైన్మెన్ నారాయణరావు, లైన్ ఇన్స్పెక్టర్ రామచంద్రుడు సిబ్బంది శంకర్, కిరణ్, మెగనాథ్, శ్రీకాంతలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి/సంతబొమ్మాళి, మే24 (వార్త):** వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. టెక్కలి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా వినతులు స్వీకరించారు. కొందరు ప్రజలు తాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ (=ఔ), తదితర శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భూ సమస్యల పరిష్కారానికి భరోసాప్రజా దర్బార్‌కు వచ్చిన వినతుల్లో అత్యధికంగా భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులే ఉన్నాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పిదాలు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేకమంది పేదల భూములు ఇతరుల పేర్లకు మార్పిడి అయ్యాయని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, రెవెన్యూ అధికారులతో మాట్లాడి బాధితులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. విద్య, వైద్యం మరియు ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శక పాలన అందిస్తామని పునరుద్ఘాటించారు. "సమస్య ఏదైనా సరే, నేరుగా నా దృష్టికి తీసుకురండి" అని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

కోటబొమ్మాళి మండలంలోని నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో టెక్కలి మండలానికి చెందిన నలుగురికి 2.42లక్షల చెక్కులను మంత్రి అచ్చెన్నాయుడు పంపిణీ చేశారు. పి. తులసి లక్ష్మి - రూ. 64,579, ఎం. మహాలక్ష్మి - రూ. 61,529, ఎస్. విమలకుమారి - రూ. 66,280, పి. శివసాయి - రూ. 50,019/- చెక్కులు అందుకున్న అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. వైద్య ఖర్చుల భారాన్ని మోయలేక మా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో మంత్రి అచ్చెన్నాయుడు మా పరిస్థితిని అర్థం చేసుకున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మాకు ఇంత త్వరగా సాయం అందేలా చేసి మా ఇళ్లలో వెలుగులు నింపారు. కన్నీటిలో ఉన్నప్పుడు ఆదుకున్న మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని వారు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

**కోటబొమ్మాళిలో రూ.10.51 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్క్**

టెక్కలి నియోజక వర్గం కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామంలో ఎమ్మెస్ఎంఈ పార్కుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోమవారం వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం వెల్లడించారు. చీపుర్లపాడు వద్ద రూ.10.51 కోట్లతో నిర్మించనున్నారని చెప్పారు.

## ఎమ్మెల్యే గారు.. నా ప్రశ్నలకు సమాధానమివ్వండి

### పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, న్యాయవాది దువ్వాడ శ్రీధర్



**పలాస, మే 24 (వార్త):** 'పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష.. నేను వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పండని, పలాస జిల్లాపై మాట తప్పేరెందుకని, మువ్వల నగేష్ ఘటనపై నారా లోకేష్ ఇచ్చిన హామీ ఏమయింది, మద్యం దోపిడీకి అడ్డుకట్టేది అని సామాజిక వేత్త, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) ప్రశ్నించారు. ఆదివారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ఉద్దేశించి సూటిగా ప్రశ్నలు సంధించారు. ఎన్నికలకు ముందు, తర్వాత కూడా పలాసను జిల్లా చేస్తామని మీరు బహిరంగ సభల్లో, పత్రికా సమావేశాల్లో పదేపదే ప్రకటించారు. పలాస జిల్లా ఏర్పాటు ఖాయమని ప్రజలకు హామీ ఇచ్చారు. మరి ప్రభుత్వం చివరి నిమిషంలో నిర్ణయం మార్చుకున్న తర్వాత పలాస జిల్లా కోసం మీరు అసెంబ్లీలో ఎందుకు గళం విప్పలేదని ప్రశ్నించారు. లక్షలాది మంది పలాస ప్రజల ఆకాంక్షను ఎందుకు పట్టించుకోలేదన్నారు. పలాస జిల్లా కావాలని కోరుకుంటున్న ప్రతి ఒక్కరికీ మీరు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మువ్వల నగేష్ కుటుంబానికి ఎందుకు న్యాయం చేయలేదన్నారు. పలాస నియోజకవర్గంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ప్రతి బాటిల్‌పై 20 అదనంగా వసూలు చేస్తున్నారని, ఇక గ్రామాల్లో యథేచ్ఛగా నడుస్తున్న బెల్ట్ షాపుల్లో అయితే 50 వరకు ఎంఆర్పీకి మించి దోచుకుంటున్నారని, ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. దమ్ముంటే ప్రజల ముందుకు వచ్చి జవాబు చెప్పాలని శ్రీధర్ (బాబా) డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో రామరాజ్యం

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్




**పలాస, మే 24 (వార్త):** రాష్ట్రంలో రామరాజ్యం నెలకొందని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్ అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన అంతం కావడానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అహర్నిశలు కష్టపడిన నాయకులకి, కార్యకర్తలకి, సోషల్ మీడియా వారియర్స్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. రెండేళ్ల క్రితం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే ఈ శుభ సందర్భంలో మన పలాస నియోజకవర్గంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కూడా ఈ ఉత్సవాన్ని ఒక పండుగలాగా చేసుకోవాలన్నారు. గత ఐదు సంవత్సరాల పాటు అనేక ఇబ్బందులు పడ్డాం, కేసులు పెట్టారు, జైలుకి పంపించారు, అనేక రకాలుగా వేధించారన్నారు. నాయకులు, కార్యకర్తలు అన్నింటినీ భరించి పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారన్నారు.

## నిరుపేదలకు సత్య సాయి సేవలు



**కవిటి, మే 24 (వార్త):** కవిటి మండలం రాజపురం గ్రామంలో సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతినెల నిరుపేదలకు అందించే నిత్యవసర సరుకులను ఈనెల ఆదివారం నాలుగు కుటుంబాలను ఎంపిక చేసి నెలకు సరిపడే నిత్యవసర కిరాణా సరుకులను అందజేశారు. ఒరిస్సాకు చెందిన కోటిలింగి గ్రామం జోలి బాడిత్య, అన్నపూర్ణ నాయక్, గిలాయ్ బైరమ్మ, జండా లక్ష్మి కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాల వద్ద సత్యసాయిని ప్రార్థించి ఆ కుటుంబాలు మంచి స్థాయికి చేరుకోవాలని కోరుతున్నారు.

## దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### విభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



**మందస, మే24(వార్త):** దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ కోరారు. మందస పట్టణంలో ఆదివారం విభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మోహనరావు ఆధ్వర్యంలో మందస మండలంలో దివ్యాంగుల అవగాహన సదస్సు జరిగింది. సమావేశంలో అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ మాట్లాడుతూ రీవెరిఫికేషన్ జరిగిన సదరం సర్టిఫికెట్స్ చాలామంది దివ్యాంగులకు రావడం లేదని, అదేవిధంగా యుడిఐడి కార్డు గురించి సచివాలయ సిబ్బంది ద్వారా తెలియజేసి సచివాలయ సిబ్బంది ద్వారా అప్లై చేసే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. వివాహంతో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతీ దివ్యాంగులకి ఇల్లు స్థలాల కేటాయించి, ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొందర దుదిష్టిపాత్రో, బ్రాహ్మణ కుల అధ్యక్షుడు సింహాచలం మహంతి, బీజేపీ మందస టౌన్ అధ్యక్షుడు అడ్డి గౌడ్ పాల్గొన్నారు. కార్యవర్గం ఎంపికవిభిన్న ప్రతిభావంతుల హక్కుల జాతీయ వేదిక మందస మండల నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడు ముంజేటి దేవదాస్, అధ్యక్షునిగా అందాల ఆవేష్, ఉపాధ్యక్షులు జుత్తు హేమావతి, ప్రధాన కార్యదర్శి శిస్టు ఝూన్సీ, కమిటీ సభ్యులు తెప్పల పాపారావు, మామిడి జానకి సభ్యులుగా ఎన్నుకున్నారు.


## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**శ్రీకాకుళం మే 24 (వార్త):** ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులు పంచాది జగన్నాధం, విశ్రాంతి మండల విద్యాశాఖధికారి, మొయ్యల సింహాచలం, విశ్రాంతి గ్రేడ్ 2 ఫిజికల్ డైరెక్టర్ పైడిశెట్టి జగన్నాధం, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు, మాస్టర్లను శాలువా కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. గత స్మృతులను పూర్వవిద్యార్థులంతా స్మరించుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు.

# పచ్చని ఉద్దానంలో ఎయిర్ పోర్టుతో విధ్వంసం

- కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములు ఇవ్వం
- భూములు కోల్పోతే వేలాది కుటుంబాలకు తీవ్ర నష్టం
- బలవంతపు భూసేకరణ చేయవద్దు
- అధికారులను కోరిన రైతులు, మహిళలు





**మందస, మే 24(వార్త):** పచ్చని ఉద్దానంలో ఎయిర్ పోర్టుతో విధ్వంసం జరుగుతుంది.. కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములు ఇవ్వం.. భూములు కోల్పోతే వేలాది కుటుంబాలకు తీవ్ర నష్టం కలుగుతుంది.. బలవంతపు భూసేకరణ చేయవద్దు అంటూ అధికారులను బాధిత రైతులు, మహిళలు కోరారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతంలో రాంపురం, తెలగ గంగువాడ గ్రామాలలో శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా టి.గంగువాడ, రాంపురం గ్రామాలకు చెందిన ఎయిర్ పోర్టు బాధిత రైతులు జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అదేవిధంగా ప్రత్యక్షంగా తమ సమస్యలను అధికారులకు చెప్పారు. తమ కుటుంబాలకు జీవనాధారమైన సాగు భూములను కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం ఇవ్వబోమని స్పష్టం చేశారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములే తమ కుటుంబాలకు అన్నం పెడుతున్నాయన్నారు. భూములు కోల్పోతే జీవనోపాధి దెబ్బతిని, కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను గౌరవించి తమకు న్యాయం చేయాలని కోరారు. అధికారులు రైతుల అభ్యంతరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆర్.అప్పలరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు డి.వేణు గోపాలరావు, జయదేవి, మందస మండల తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'మహానాడు' నిర్వహణపై విస్తృత చర్చ



**మందస, మే 24(వార్త):** మందస మండలం హరిపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణుల అత్యవసర, కీలక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన మాట్లాడుతూ.. పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోబోయే రాబోయే మహానాడు కార్యక్రమాన్ని ఏ విధంగా విజయవంతం చేయాలనే అంశంపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు క్లస్టర్, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# యువతకు శిక్షణ ఇచ్చి..

# అండగా ఉంటాం!

- జిల్లాలో త్వరలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు
- అత్యాధునిక వసతులతో నూతన శిక్షణ కేంద్రం
- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి
- ఆమదాలవలస ఎమ్మెల్యే, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు కూన రవికుమార్
- ఎచ్చెర్ల పోలీసు మైదానంలో రన్నింగ్, క్రికెట్ ట్రాక్‌లు
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
- ఎస్పీతో కలిసి జిల్లా స్థాయి పురుషుల, మహిళల క్రికెట్ శిక్షణ కేంద్రం ప్రారంభం






శ్రీకాకుళం, మే 24(వార్త): గ్రామీణ ప్రాంత యువతలో అద్భుతమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన మౌలిక వసతులు, నాణ్యమైన కోచింగ్ అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తారని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. జిల్లాలో త్వరలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని, అత్యాధునిక వసతులతో నూతన శిక్షణ కేంద్రం ప్రారంభిస్తామన్నారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డీసీఏ) కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పురుషుల, మహిళల క్రికెట్ శిక్షణ కేంద్రాన్ని (క్రికెట్ నెట్స్, టార్ఫ్ వికెట్) జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి ప్రారంభించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడి హోదాలో ఆయన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కూన రవి కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) పూర్తి అండదండలు అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఒక రంగంపై ఆసక్తి ఉంటుందని, ఈ మధ్య కాలంలో యువత క్రికెట్ వైపు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని చెప్పారు. క్రీడల్లో ఒక అడుగు ముందడుగు వేస్తే అది భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. విద్యార్థులు ఎల్లప్పుడూ తమ స్వయం ప్రతిభను నిరూపించుకోవడానికి ప్రయత్నించాలని, తల్లిదండ్రులపై భారం కాకుండా వారికి అండగా నిలిచేలా ఎదగాలని హితవు పలికారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని వివరించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకు తొలి ప్రాధాన్యత ఇస్తూనే, క్రీడలను ఒక లక్ష్యంగా ఎంచుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎచ్చెర్లలోని పోలీస్ మైదానంలో రన్నింగ్, క్రికెట్ ట్రాక్‌లు సిద్ధంగా ఉన్నాయని, యువత అక్కడ టోర్నమెంట్లు, మ్యాచ్‌లు ఆడుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా మహిళల క్రికెట్ టోర్నమెంట్లకు ఉచితంగా అనుమతి ఇస్తామని ప్రకటించారు. అయితే, ఆడిన తర్వాత మైదానాన్ని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత క్రీడాకారుల పైనే ఉందన్నారు. అనంతరం వారు మైదానంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక శిక్షణా సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధి ఇలియాస్, అసోసియేషన్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్లు, సంఘ సభ్యులు, క్రీడా నిర్వాహకులు, కోచ్‌లు, యువ క్రీడాకారులు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.






# గంజాయి తాగిన రెండు నిమిషాల్లోనే నిర్ధారణ

- డ్రగ్ డిటెక్షన్ కిట్ ద్వారా పరీక్షలు
- గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీసుల విస్తృత తని
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం, మే 24(వార్త): జిల్లాలో గంజాయి నిర్మూలనకు మరింత కఠిన చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి తెలిపారు. యువతను గంజాయి మత్తు నుంచి దూరం చేయడంలో భాగంగా రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా జిల్లాకు అందజేసిన అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్లు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ కిట్ల ద్వారా మూత్ర నమూనాలను పరీక్షించి కేవలం ఒకటి నుంచి రెండు నిమిషాల్లోనే గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించారా లేదా అన్నది నిర్ధారించవచ్చని తెలిపారు. పరీక్షల్లో పాజిటీవ్‌గా తేలిన వారికి కౌన్సెలింగ్‌తో పాటు చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయన్నారు. వాటి నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత



ఇస్తోందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలన్నారు. జిల్లాలో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయిన్నారు. గంజాయి సేవిస్తూ లేదా విక్రయిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు, డయల్ 112 లేదా 1972కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ, శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలో ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, గంజాయి సేవిస్తూ లేదా మత్తు పదార్థాలు వినియోగిస్తూ పట్టుబడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ



ఆదేశాల మేరకు శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో ఆదివారం శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలోని శ్రీకాకుళం వన్‌టౌన్, టూ టౌన్, ఆమదాలవలస, ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధుల్లో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది 30 మందికిపైగా అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గంజాయి, డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా మూత్ర నమూనాలను సేకరించి వ్యక్తులపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ పరీక్షలు చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## దుబాయ్‌లో సంతబొమ్మాళి వాసి అదృశ్యం

**సంతబొమ్మాళి, మే 24 (వార్త):** సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ ఆర్.మరువాడ గ్రామానికి చెందిన పాల ఈశ్వరరావు దుబాయ్‌లో అదృశ్యం అయినట్లు భార్య భారతి తెలిపారు. భార్య కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 15 తేదీన హైదరాబాద్ నుండి దుబాయ్‌కు కూలీ పనులు నిమిత్తం స్థానిక ఏజెంట్ ద్వారా ఈశ్వరరావు వెళ్ళారు. 16 తేదీన ఫోన్ ద్వారా కుటుంబీకులతో మాట్లాడారు. ఆ తర్వాత నుంచి రెండు మూడు సార్లు ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేసి అరబ్‌లు మాట్లాడి పెట్టేస్తున్నారు. తరువాత రోజు నుండి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. తన భర్త కూడా ఇంటికి ఫోన్ చేయడం లేదని అన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కలిసి తమ గోడును చెప్పగా వారు న్యాయంచేస్తామని హామీ ఇచ్చారన్నారు. తన భర్త ఆచూకీని కనుగొని న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. తప్పిపోయిన ఈశ్వరరావు కు భార్య భారతి, తల్లిదండ్రులు ఆదినారాయణ, గారమ్మ, కుమారుడు అరవింద్ రెడ్డి, కుమార్తె దర్శిని ఉన్నారు. కుటుంబం పెద్ద దిక్కు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు విలపిస్తున్నారు.

# కొండ కోనల్లో.. దాహం కేకలు



**☀ పాతపట్నం నియోజకవర్గ గిరిజన ప్రాంతాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ☀ అడుగంటిన బావులు, మొరాయించిన బోర్లు ☀ మైళ్ల దూరం నడిస్తేనే చుక్క నీరు ☀ గిరిజన గ్రామాల వైపు చూడని పాలకులు**

**కొత్తూరు, మే 24 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. మండుతున్న ఎండలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, చుక్క వర్షం లేకపోవడంతో కొండ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుక్కెడు తాగునీటి కోసం మహిళలు, చిన్నారులు కిలోమీటర్ల మేర నడవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా గిరిజన గ్రామాలను పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో సుమారు 70 గిరిజన ఆవాసాలు ఉన్నాయి. వేలాది మంది పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి ఏడాది వేసవిలో నీటి సమస్య ఎదురైనా, ఈసారి పరిస్థితి మరింత విషమంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాల్లో పాతపట్నం ఒకటిగా నిలవడంతో నేలబావులు పూర్తిగా అడుగంటిపోయాయి. పాడైపోయిన బోరుబావులు మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది.కొన్ని గ్రామాల్లో వందలాది మంది ప్రజలు కేవలం ఒకే ఒక్క బోరుబావిపై ఆధారపడాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. నీటి కోసం మహిళలు, చిన్నారులు మైదాన ప్రాంతాలకు చెమటోడ్చుతూ మైళ్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోంది.కొత్తూరు మండల పరిధిలోని చీపురుపల్లి, పెద్దరాజపురం, చిన్నరాజపురం, దాపాకులగూడా, జెన్నోడుగూడ, దొండమామిడిగూడ, అద్దాయిగూడ, పాండురామనుగూడ, కూడహగూడ, గ్యాసరగూడ, అడ్డంగి, అబలాసింగి తదితర గిరిజన గ్రామాల్లో తాగునీటి కొరత పరాకాష్టకు చేరింది. మైదాన ప్రాంతాల్లోని గ్రామాల్లో కూడా చెరువులు ఎండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైప్‌లైన్ వ్యవస్థలు దెబ్బతిన్నప్పటికీ మరమ్మత్తులు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమయంలో పెద్దఎత్తున హామీలు ఇచ్చే నాయకులు, గెలిచిన తర్వాత కనీసం మొఖం కూడా చూపటంలేదని, కనీస మౌలిక సదుపాయాలపైనా దృష్టి పెట్టడం లేదని గిరిజన సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఏళ్లుగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు వెంటనే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని, పాడైపోయిన బోరుబావులు, పైప్‌లైన్ వ్యవస్థలను యుద్ధప్రాతిపదికన మరమ్మత్తు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో శాశ్వత తాగునీటి పథకాలు అమలు చేయాలని గిరిజన సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించాయి.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546